సాక్షి
ప్రకాశం
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



రాజ్యలక్ష్మికి చందనాలంకారం

ఒంగోలు మెట్రో: శ్రావణ మాస అమావాస్య పొలాల అమావాస్య సందర్భంగా స్థానిక కొప్పోలు చెన్నకేశవ స్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి సోమవారం 9 కేజీల చందనం, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు. 108 కలువ పూలతో మూలమంత్ర సహిత అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

గరిష్టం/కనిష్టం
31.3/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

విజయవాడ ముంపు కూటమి వైఫల్యం



ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: భారీ వర్షాల కారణంగా కృష్ణానది వరద ఉధృతికి విజయవాడ ముంపునకు గురవటం ముమ్మాటికి కూటమి ప్రభుత్వం వైఫల్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సీఎం చంద్రబాబు ఇంట్లోకి నీరు రావటం వాస్తవమన్నారు. చంద్రబాబు అది కప్పిపుచ్చుకోవటానికి కలెక్టర్ కార్యాలయంలో బసచేసినట్లు నటిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ముంపునకు గురైన ప్రజలకు పునరావాసం కల్పించకుండా వరదల ద్వారా లబ్ధిపొందాలని చూడటం దారుణమన్నారు. వరద బాధితులను ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని, నాశనమైన వ్యవస్థలను పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోలీసు శాఖ గౌరవాన్ని ఇనుమడింపజేసిన వెస్లీ

● ఎస్పీ ఏఆర్ దామోదర్



కలెక్టరేట్ వద్ద ఉన్న వెస్లీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రధాన భద్రతా అధికారిగా విధులు నిర్వహిస్తూ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన అద్దంకి సాల్మన్ కేరి వెస్లీ జీవితం నేటి తరం పోలీసులకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. దివంగత ఐపీఎస్ అధికారి సాల్మన్ కేరి వెస్లీ 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖ గౌరవాన్ని ఇనుమడింపజేసేలా వెస్లీ విధులు నిర్వర్తించారని కొనియాడారు. వెస్లీ కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఎఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్‌ఐలు కిశోర్ బాబు, బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గుముఖం

● 26 మండలాల్లో సరాసరి 3.1 మి.మీ నమోదు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు సోమవారం తగ్గుముఖం పట్టాయి. 38 మండలాలకు గాను కేవలం 26 మండలాల్లో మాత్రమే స్వల్ప వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 18.8 మి.మీలు, సరాసరి 3.1 మి.మీలు నమోదైంది. జిల్లాలో సోమవారం నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. ముండ్లమూరు 14.9 మి.మీలు, మార్కాపురం 14.2, పెద్దారవీడు 8.6, తర్లుపాడు 7.4, కంభం 7.2, దొనకొండ, బేస్తవారిపేటలలో 6 మి.మీలు, అర్ధవీడు 4.8, కురిచేడు, పుల్లలచెరువులో 4.2 మి.మీల చొప్పున, తాళ్లూరు, పొదిలి, గిద్దలూరులో 3.2 చొప్పున, దోర్నాలలో 2.6, కనిగిరి, యర్రగొండపాలెం, కొమరోలులో 2.4 చొప్పున, వెలిగండ్లలో 2.2, నాగులుప్పలపాడు, మర్రిపూడి, రాచర్లలతో 2, సంతనూతలపాడులో 1.8, కొత్తపట్నంలో 1.4, కొనకనమిట్లలో 1.2, కొండపి 1 మి.మీ చొప్పున నమోదైనట్లు అధికారులు తెలిపారు.

327.5 ఎకరాల్లో పంట నష్టం

రెండు రోజుల నుంచి కురిసిన వర్షానికి, వీచిన గాలులకు ఖరీఫ్‌లో సాగు చేసిన నువ్వులు, కొర్ర, సజ్జ పంటలు 327.5 ఎకరాల్లో నష్టపోయినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో నాలుగు మండలాల్లోని 9 గ్రామాల్లో 1552.5 ఎకరాలు ఆయా పంటలు సాగు చేయగా అందులో 334 మంది రైతులకు చెందిన 327.5 ఎకరాలు దెబ్బతిన్న పొలాలను సందర్శించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు.

రాజన్న రాజ్యమే శరణ్యం

● వాడవాడలా మహానేతకు ఘన నివాళి
● జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, అన్నదానాలు



సింగరాయకొండలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్



దేవరాజుగట్టులో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



ఒంగోలు చర్చి సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె, పార్టీ నాయకులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఏ ప్రభుత్వం వచ్చినా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రణాళికలే కొనసాగిస్తున్నాయని, ప్రతి మదిలో రాజన్న స్మరణ వినిపిస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు కొనియాడారు. మహానేత 15వ వర్ధంతి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఊరూ...వాడా నిర్వహించారు. గ్రామ గ్రామాన అపర భగీరథునికి నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నీరాజనాలు పలికారు. అన్నదానాలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు.

✦ ఒంగోలులో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. తొలుత చర్చి సెంటర్‌లో మహానేత భారీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జంకె వెంకటరెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్‌తో పాటు సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకుడు బొట్ల సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి గుర్రం వెంకయ్య, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి దామరాజు క్రాంతి కుమార్‌లో పాటు పలువురు పాల్గొని ఆ దివంగత నేతకు నివాళులర్పించారు. వైఎస్సార్‌తో పాటు హెలికాప్టర్ ప్రమాదంలో అశువులు బాసిన ఆయన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జాన్ వెస్లీ విగ్రహానికి కూడా పూల మాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని పలు డివిజన్లలో అన్నదానం చేశారు.

✦ దర్శి పట్టణంలో గడియార స్తంభం సెంటర్, వైఎస్సార్ సెంటర్‌తో పాటు మండలంలోని రాజంపల్లిలో రాజన్నకు నివాళులర్పించారు. రాజంపేటలో నూతనంగా వైఎస్సార్ విగ్రహాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం చేశారు.

✦ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వైఎస్ఆర్ కడప జిల్లా ఇడుపులపాయలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు పాల్గొన్నారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

✦ కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మహానేతకు ఘన నివాళులర్పించారు. సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లతో పాటు శానంపూడి రోడ్డులోని వైఎస్సార్ ఆర్చ్ వద్ద వర్ధంతిని నిర్వహించారు. కొండపి, పొన్నలూరు కార్యక్రమాల్లో కూడా ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యవిభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, సామంతుల రావి కుమార్, యనమల మాదవి పాల్గొన్నారు.

✦ గిద్దలూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ కుందురు నాగార్జున రెడ్డి అన్ని మండలాల్లో పర్యటించి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గిద్దలూరులోని రాచర్ల గేటు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఎంపీపీ కడప లక్ష్మి, వైస్ ప్రెసిడెండ్ నోవల్, పులి రామకృష్ణా రెడ్డి, భూమా నరసింహారెడ్డి, పాలుగుల నరసింహా రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

✦ మార్కాపురంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. మార్కాపురం పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలవేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మున్సిపల్ చైర్మన్ చిల్లంచర్ల బాల మురళీ కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే.ఇస్మాయిల్, మాజీ ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, సిరాజ్, కొత్త కృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

✦ సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాస రావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాస రావు, చీమకుర్తి మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకట్రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

✦ కనిగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి దద్దాల నారాయణ యాదవ్, పార్టీ ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం 500 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ, 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, కస్తూరి రెడ్డి, గుంటక తిరుపతి రెడ్డి, సీహెచ్ సాల్మన్, వైఎం సరితా రెడ్డి, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాజంపల్లిలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ



అన్నదానం చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

● టీడీపీ అధికారంలోకి రాగానే అక్కడ వైఎస్సార్ విగ్రహం తగులబెట్టిన దుండగులు
● అదే స్థానంలో మరో విగ్రహాన్ని ఆవిష్కరించిన బూచేపల్లి వెంకాయమ్మ
● వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

దర్శి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుర్తుతెలియని దుండగులు దర్శి మండలంలోని రాజంపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పెట్రోలు పోసి నిప్పంటించారు. అదే స్థానంలో నూతన విగ్రహాన్ని వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారీ జనసందోహం హాజరై వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు వచ్చిన బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి లకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. పూలు చల్లుతూ డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలోకి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ విగ్రహాలు పడగొట్టడం మంచి సంస్కృతి కాదని ప్రజల్లో అభిమానం సంపాదించుకోవాలని హితవు పలికారు. రాజన్న ఆశయసాధనే లక్ష్యంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో మంచి పాలన అందించారన్నారు. వైఎస్సార్ విగ్రహాన్ని తగుల బెట్టడం తమను ఎంతో కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పేదల పార్టీ అని చెప్పారు. ఎంపీలు వెళ్లిపోతున్నారని ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఒక ఎంపీ పార్టీలో నుంచి వెళ్లిపోయినంత మాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం ఉండదని అన్నారు. జగనన్న ఆధ్వర్యంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం హాజరైన ప్రజలందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ వనం అన్నపూర్ణమ్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీపీ సుధా అచ్చయ్య, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా మాజీ జేసీఎస్ కన్వీనర్ బత్తినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, తుళ్లూరి బాబురావు, జెడ్పీటీసీ రత్నరాజు, బండారు బాబు, గొర్ల గోపాల్, చిన్న సుబ్బారావు, బ్రహ్మయ్య, బండారు గోపాల్, బత్తినేని నరశింహారావు, దామా చిన్నవెంకటేశ్వర్లు, పత్తిపాటి వెంకట్రామయ్య, రామారావు, యర్రమాసు వెంకటేశ్వర్లు, బాలేసు, దేవరకొండ శ్రీను, రామారావు, దొండపాటి వెంకటేశ్వరరెడ్డి, అంకిరెడ్డి, ముప్పూరి బ్రహ్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బావి పూడ్చి ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

● టీడీపీ కార్యకర్త నిర్వాకం



వాటర్ ప్లాంటు పక్కన ఉన్న బావిని ఆనవాలు లేకుండా పూడ్చిన దృశ్యం

జరుగుమల్లి (సింగరాయకొండ): టీడీపీ కార్యకర్త బావిని పూడ్చి మరీ ప్రభుత్వ స్థలం ఆక్రమణకు ప్రయత్నించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరుగుమల్లి మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మూలె దత్తాత్రేయ గ్రామంలోని రామాలయం వీధిలో తన స్థలం పక్కనే పంచాయతీ నిర్మించిన గిలక బావిని జేసీబీతో పూడ్చాడు. వాస్తవానికి ఈ బావిని ఆ ప్రాంత ప్రజలు తాగు నీటి అవసరాలకు ఉపయోగిస్తుంటారు. అంతేకాక గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంటుకు కూడా ఈ బావి నీటిని ఉపయోగించేవారు. తాగునీటి అవసరాలను తీర్చే బావిని తన స్వంత అవసరాల కోసం ఏవిధంగా పూడ్చుతాడని టీడీపీ కార్యకర్త దత్తాత్రేయ పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సోము సరస్వతి భర్త సుబ్బారెడ్డి సోమవారం గ్రామస్తుల తరపున ఎంపీడీవో జలజాక్షికి ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జలజాక్షి సదరు ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ అంజలీదేవిని ఆదేశించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి చంద్రకళను వివరణ కోరగా పంచాయతీ బావిని పూడ్చడం వాస్తవమేనని తాను కూడా విషయాన్ని ఎంపీడీవోకు తెలిపానని, తదుపరి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కృష్ణా వరద బాధితులకు జిల్లా సాయం



భోజనం ప్యాకెట్లను ఎన్‌టీఆర్ జిల్లాకు పంపేందుకు సిద్ధం చేసిన వాహనం

ఒంగోలు అర్బన్: భారీ వర్షాలకు ముంపునకు గురైన ఎన్‌టీఆర్ జిల్లాకు మన జిల్లా నుంచి వీలైనంత వరకు చేయూత అందిస్తామని ఆ మేరకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ తమీమ్అన్సారియా కోరారు. సోమవారం ప్రకాశం భవనంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొత్తపట్నం, సింగరాయకొండల నుంచి ఇప్పటికే ఎన్‌టీఆర్ జిల్లాకు 35 బోట్లను పంపామని తెలిపారు. అదేవిధంగా సోమవారం మధ్యాహ్నానికి 25 వేల భోజనం ప్యాకెట్లు పంపించామని, రాత్రికి మరో 50 వేల భోజనం ప్యాకెట్లు పంపుతామన్నారు. రెండు ఫంక్షన్ హాళ్లలో వంటలు చేసి భోజనం ప్యాకింగ్ చేసి పంపుతున్నట్లు చెప్పారు. భోజనంతో పాటు పాలు, తాగునీరు, బ్రెడ్ తదితర వస్తువులను ఎన్‌టీఆర్ జిల్లాకు పంపుతున్నామన్నారు. అంతేకాకుండా సహాయక చర్యల కోసం రెవెన్యూ సిబ్బందిని పంపామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కూడా అక్కడే విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన జిల్లాలో పంట, ఇతర నష్టం అంచనాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. తుఫాన్ ప్రభావం జిల్లాలో లేదని స్పష్టం చేశారు. మార్కాపురం డివిజన్ పరిధిలో ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. ఆయా ప్రదేశాల్లో ప్రజలను అప్రమత్తం చేసి వాగుల వైపు వెళ్లకుండా తగిన బందోబస్తు చర్యలు తీసుకున్నామన్నారు.

హాయ్.. చెబితే అనుమతిస్తాం

● గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో అనుమతులు
● 7995095800 వాట్సప్ నెంబర్ విడుదల
● ఎస్పీ ఏఆర్ దామోదర్



ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మండపం ఏర్పాటు చేయాలంటే ఇక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, 7995095800 ఫోన్ నంబరుకు వాట్సప్ చేసి హాయ్ అని మెసేజ్ పంపిస్తే చాలు మిగతా ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుపుకొని అనుమతులు వచ్చేస్తాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వాట్సప్ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పెడితే నిరభ్యంతర పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం మొబైల్‌కు వస్తుందని వివరించారు. అనంతరం గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ అనే వెబ్‌సైట్‌లో మండప కమిటీ వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఏ రోజు ఎక్కడ చేస్తారు, ఏ సమయంలో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు తదితర వివరాను నమోదు చేసి దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు చేరుతుందని, ఆయన ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ అధికారుల బృందం మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శించి , ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉంటే క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీ విడుదల చేస్తారని తెలిపారు. ఈ సర్టిఫికెట్‌ను ప్రింట్ తీసి మండపంలో ఉంచాలని, పోలీసులు ఎప్పుడైనా పరిశీలించే సమయంలో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తనిఖీ చేస్తారని తెలిపారు. గణేష్ మండపాలు ఏర్పాటుకు కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, ఏదైనా ఆ కమిటీ బాధ్యత వహించాలన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ, ప్రైవేటు స్థలాల్లో మండపాలు ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారుల, యజమానుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ నెల 7వ తేది నుంచి జరిగే వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని ఎస్పీ ఏఆర్ దామోదర్ నియమ నిబంధనలను విడుదల చేశారు.

గేదెను చంపిన చిరుత

● అక్కచెరువు తండాలో చిరుత సంచారం



వివరాలు సేకరిస్తున్న ఫారెస్టు అధికారులు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం గొట్టిపడియ పంచాయతీలోని అక్కచెరువు తండా పరిధిలోని చక్రాల కాలువ వద్ద ఆదివారం చిరుతపులి గేదెను తినింది. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తండాలోని మేఘావత్ ఈశ్వరీబాయ్‌కు చెందిన గేదెలు మేతకు అడవికి వెళ్లాయి. ఆదివారం రాత్రికి ఇంటికి రాకపోవడంతో అనుమానించి సోమవారం వెతకగా చిరుతపులి దాడిచేసి చంపితిన్నట్లు గుర్తించి మార్కాపురం అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి చిరుతపులి కాలిముద్రలు, గేదె అవశేషాలను గుర్తించారు.